2/68

టెక్నిషియన్లు

నిర్మాత - దర్శకుడు — కె. వి. రెడ్డి, బి. యస్. సి (ఆనర్సు)

కథ :

కె. వి. రెడ్డి, బి. యస్. సి(ఆనర్సు)
పింగళి నాగేంద్రరావు
శింగీతం శ్రీనివాసరావు, బి. యస్. సి.

మాటలు, పాటలు : పింగళి నాగేంద్రరావు.

సినిమా అనుకరణ : కె. వి. రెడ్డి.

ఛాయాగ్రహణం : మాధవ్ బుల్‌బులే.

శబ్దగ్రహణం : వి. శివరాం,
బి. ఏ., బి. యస్. సి.

ప్రోసెసింగ్ : యస్. సి. సేన్‌గుప్త.

ఎడిటింగ్ : జి. కల్యాణసుందరం.
డి. జి. జయరాం.

మేకప్ : యం. పీతాంబరం,
యస్. సహదేవరావు,
టి. పి. భక్తవత్సలం.

నృత్యం : పసుమర్తి కృష్ణమూర్తి.

సంగీతం : పెండ్యాల నాగేశ్వరరావు.

కళ : గోఖలే, కళాధర్.


నేపథ్యగానం : ఘంటసాల, సుశీల, లీల,
జానకి,
యల్. ఆర్. ఈశ్వరి.

నిర్మాణ సహాయకులు:

యం. యస్. చలపతిరావు,
డి. జగన్నాథ్.

సహాయ దర్శకులు : సి. నాగేశ్వరరావు, బి. ఏ.
కె. బాబూరావు,
యస్. శ్రీనివాసరావు,
బి. యస్. సి.
కె. యస్. రెడ్డి, బి. ఏ.

Printed at the B. N. K. Press Private Ltd., Madras-26.


విజయా వారి
క్రియాసిద్ధి సత్వే భవతి
ఉమా చండీ గౌరీ శంకరుల కథ
నిర్మాత-దర్శకుడు
కే.వి.రెడ్డి B.Sc.,[Hons]

నటీనటులు

నటరత్న : యన్. టి. రామారావు

అభినయ సరస్వతి : బి. సరోజాదేవి

ముక్కామల
రేలంగి
రమణారెడ్డి
పద్మనాభం
ధూళిపాళ
డాక్టర్ శివరామకృష్ణయ్య-
అల్లురామలింగయ్య
బాలకృష్ణ
మోతుకూరి సత్యం
రాజారెడ్డి
ఎ. ఎల్. నారాయణ
బి. శీతారాం
మల్లాది
చలం
కోళ్లసత్యం

కోటేశ్వరరావు
డి. నారాయణ
పి. జె. శర్మ
మాష్టర్ ప్రభాకర్
గిరిజ
ఋష్యేంద్రమణి
ఛాయాదేవి
మీనాకుమారి
సూర్యకళ
జూనియర్ భానుమ
సబిత
అన్నపూర్ణ
సురభి కమల
సత్యవతి

విజయా వారి ఉమా చండీ గౌరీ శంకరుల కథ



శ్రీ పార్వతీ పరమేశ్వరులలో అధికు లెవరన్న సత్యమును, పరమేశ్వరునే అడిగి తెలుసుకొనకోరి, భృగు మహర్షి కైలాసానికి వెళ్ళాడు.

అప్పుడు పరమేశ్వరుడు పార్వతీదేవికి నాట్యం నేర్పుతున్నాడు; కనుక లోనికి వెళ్ళ రాదని ద్వారపాలకులు హాహా హూహూలు, భృగు నడ్డగించారు. తను పిలిస్తే శివుడు పరుగెత్తుకు వస్తాడని ధీమాతో, భృగు మహర్షి శివుని ఎలుగెత్తి పిలిచాడు; మళ్ళీ పిలిచాడు; ఇక ఆగలేక అడ్డు పడ్డ హాహా హూహూలను రాక్షసులుకండని శపించి, ఆవేశంతో శివుని పిలుస్తూ భృగు లోనికి వెళ్ళాడు. "నా నాట్యం కంటె మానవుని స్వాగతం ముఖ్యమా" అంటూ పార్వతి శివుని వారించుట చూచాడు; "మానవుడనని తృణీకరించి పరమేశ్వరుని మూడుసార్లు నీవు ఆపినావు గనుక, నీవు మూడుసార్లు మానవజన్మ నెత్తి మానవసహజమైన దౌర్భాగ్యాన్ని అనుభవింతువుగాక" అని భృగు మహర్షి పార్వతీదేవిని శపించాడు. "నీ వీ నిముషానే రాక్షసుడవై పోయి పూర్వజ్ఞానం లేకుండా సాధుపీడ చేస్తూ భూమిపై సంచరింతువుగాక" అని పార్వతీదేవి భృగును శపించింది. శక్తిమంతులు క్షణం సహనాన్ని విస్మరిస్తే, ఎంత ప్రమాదమో చూచారా అని, శివుడు, ఉభయులనూ మందలించి, భృగుకి రాక్షస జన్మ విశేష కాలం నిద్రలోనే గడుచునట్లునూ, తనచే ఖండితుడైనప్పుడు శాప విమోచన మగునట్లునూ చెప్పి, పార్వతీదేవికి, మూడు మానవజన్మలూ ఒకే కాలమున, ఒకే మాతృ గర్భమున కలుగునట్లునూ, ఆమె అనుభవించవలసిన మానవసహజ దౌర్భాగ్యాన్ని, ఎప్పటికప్పుడు, సౌభాగ్యంగా చేయడానికి తానున్నానని అభయమిచ్చాడు.

భృగుపత్ని పార్వతీదేవే తనకు కూతురుగా పుట్టాలని కోరుకొన్నది. కనుక శివుని వర ప్రకారం, పార్వతి, భృగు[illegible]

భృగు లంబకర్ణ రాక్షసుడైనాడు. భృగు శాపంతో రాక్షసులైన హాహా హూహూలు వాని అనుచరులుగానే ఉన్నారు. లంబకర్ణునికి మూడు మాసాలు నిద్రా, మూడు రోజులు మాత్రమే మెలకువ; ఆ మూడు రోజుల్లో తన కర్మ మునులబాధించడమే అని గ్రహించి, పూర్వ జ్ఞానం పోయి, తన ఆశ్రమాన్నే పాడుచేయ వచ్చాడు. అప్పుడు భృగుపత్ని ముగ్గురు పాపల్ని దేవీ మందిరంలో భద్రపరచింది. లంబకర్ణు డక్కడికే వచ్చి ఆ పాపల్ని తినాలని యత్నించాడు. భృగుపత్ని భయాందోళనతో పరమేశ్వరుని ప్రార్థించింది. వెంటనే ఉరుములు మెరుపులతో ప్రళయం భూకంపం వచ్చి, లంబకర్ణున్ని ఎక్కడో విసిరికొట్టింది. ఉయ్యాలలతో సహా పాపలూ భృగుపత్నీ కూడా తలా ఒకచోటా పోయి పడ్డారు.

ఒకపాప ఆనంద భూపతి మహారాజుకి దొరికింది. ఆ రాజదంపతులకు సంతానంలేదు. ఉమా అని పేరుపెట్టి ఆ పాపను సొంతకూతురుగా పెంచుకున్నారు.

రెండోపాప భిల్లుదొరకు దొరికింది. అప్పు డతన్ని ఒక మహావ్రణం బాధిస్తోంది. చిత్రం! పాపచెయ్యి తగలగానే బాధపోవడమేగాక పుండుకూడా ఆనవాలు లేకుండా పోయింది. ఆ మహిమ చూసి చండీ అని పేరుపెట్టి భిల్లుదొర ఆ పాపను పెంచుకున్నాడు.

మూడోపాప శేషాయ్ అనే ఒక వేశ్యకు దొరికింది. పెద్దదైతే తన ఇల్లు బంగారంతో నింపుతుందని ఆశ పడింది. కాని అలవాటుగా 'మనోరంజనీ' అని కాకుండా గౌరీ అని పేరు పెట్టి ఆ వేశ్య ఆ పాపను పెంచుకుంది.

కైలాసం వెళ్ళిన పతి తిరిగిరాలేదు; పసిపాపలు ముగ్గురూ ప్రళయంలో కొట్టుకు పోయారు. ఆ దుఃఖాన్ని భరించలేక భృగుపత్ని ఆత్మహత్యకు సిద్ధపడింది. ఆ సమయంలో చిత్రంగా ఒక బాలుడు వచ్చి ఆమెను వారించాడు. నీవెవరివంటే నేనేనంటాడు. నీ తల్లిదండ్రు లెవరంటే నీవేనంటాడు. భృగుపత్ని ఆశ్చర్యపడి తను బ్రతికి ఉండడానికి ఈశ్వరుడే ఇలా ఒక ఆధారాన్ని కల్పించాడనినమ్మి, ఆ బాలుని తీసుకుని జమదగ్ని మహర్షి ఆశ్రమానికి వెళ్ళింది.

జమదగ్ని ఆశ్రమంలో ఒక అభయ వినాయక విగ్రహం ఉంది. భృగుపత్ని తీసుకు వెళ్ళిన బాలు డా విగ్రహాన్ని సమీపించగానే ఆ శిలావిగ్రహ హస్తాలు రెండూ, నమస్కార భంగిమ

లోకి వచ్చాయి. ఆ అద్భుతాన్ని చూసి జమదగ్ని ఈ బాలునిలో ఈశ్వరాంశ ఉన్నదీ; ఇతడు జైశంకర్ అని పేరుపెట్టాడు. భృగుపత్నిని తన ఆశ్రమంలోనే ఉండమని ఆ బాలుని తన శిష్యునిగా పరిగ్రహించాడు. రాజమందిరంలో ఉమ - భిల్లుగూడెంలో - చండి - వేశ్యాగృహంలో గౌరి ముని ఆశ్రమంలో జైశంకర్ పెరిగి పెద్దవారైనారు.

భృగు మహర్షి ఏ మాయావరణంలో చిక్కుకున్నాడో తెలుసుకోవాలని, జమదగ్ని మహర్షి మంత్ర పఠనంతో ఒక యజ్ఞం చేస్తున్నారు. ఆ యజ్ఞాన్ని పాడు చెయ్యాలని హాహా హూహూలు మునివేషాల్లో అక్కడ చేరి, అపశృతులు పలికి, మంత్రపఠనం చెడగొట్టాలని యత్నించారు. అది కనిపెట్టి జైశంకర్ హాహా వీపుపై చావచరిచాడు. జైశంకర్ శక్తికి జడిసి హాహాహూలు పారిపోయారు. కాని జైశంకర్‌పై కసి తీర్చుకోవాలి. ఎలా అని హాహా అడిగితే "విరహం మందు పెడితే సరి ఏనుగంటి మొగాడు పీనుగౌతా"డని హూహూ ఉపాయం చెప్పింది. అదెలా అంటే తానొక రాజకుమార్తెను చూశాననీ ఆ సుందరిని ఈ శంకరుడొకసారి చూసేట్టు చేసి మోహంలో పడీపడగానే విడదీసేస్తే సరి; విరహంతో ఈ శంకరుడు కృశించి పోతాడని, ఇంకేం ఈ ఎత్తు బాగుందని ఒక వెన్నెల రాత్రి నిద్రిస్తున్న శంకరుని తీసుకుపోయి రాజమందిరంలో నిద్రిస్తున్న రాజకుమారి తల్పంమీద ఆమె ప్రక్కనే పడుకోబెట్టి, చాటుగా దాగారు. రాకుమారిపైట శంకర్ ముఖంపై పడేట్టు చేశారు. శంకర్ మేల్కొని "ఆహానేనెక్కడ ఉన్నాను ఏమి ఈ సుందరి మహిమ ! ఆత్మసంతసించె, కుడిభుజ మదిరె" అనుకొని, రాకుమారి మేల్కొనుట గ్రహించి మళ్ళీ తెలియనట్లు పడుకొన్నాడు. రాకుమారి లేచి చెంతనున్న సుందరుని చూసి "ఏమి ఈ అద్భుతం ఏమి ఈ సుందరమూర్తి మహిమ, అంతరాత్మ సంతసించె ఎడమభుజ మదిరె" అని ఆనందించి చెంతనే కూర్చుంది. శంకర్ ఆమె హస్తస్పర్శతో మేల్కొన్నట్టులేచాడు. ఒకరినొకరు చూసుకొని పరస్పరం మోహించుకొని తన్మయత్వంలో ఉండడం చూసి, ఇకచాలని వారిని నిద్రలో పడవేసి శంకర్ని మళ్ళీ తీసుకుపోయి ఎప్పటియట్లు వాని ఆశ్రమంలో విడిచిపోయారు. ఉదయం నిద్రలేచి రాకుమారీ శంకరూ ఒకరికోసం ఒకరు విరహంతో తపించసాగారు.

స్వప్నంలో కనుపించిన ప్రియురాలు భూమిపై ఉండితీరుతుందనే నమ్మకంతో, తల్లి అనుజ్ఞ తీసుకొని శంకర్ ప్రియాన్వేషణకై బయలుదేరాడు. భిల్లుగూడానికి రాగానే "నన్ను వరించే వీరు" డెవడని చెలులతో పంతాలు పలికి గెంతుతూ చండి కనిపించింది. ఇంకేం నీవే

నా స్వప్నసుందరివని శంకర్ చండి చెయ్యి పట్టాడు. "నేను భిల్లుదొర కూతుర్ని చండిని తెలుసుకో" అని చండి విదిలించి కొట్టింది. శంకర్ పట్టుసడలలేదు. ఇదివరకా విదిలింపుకి ఎంతెంత మొగాళ్లో ఇట్టే పట్టి కొట్టేవాళ్ళు! చండికాశ్చర్యం వేసింది. శంకర్ని, లోలోపల మెచ్చుకుంది, కాని పైకి జగడమాడ సాగింది. శంకర్ చండిని భిల్లుదొర దగ్గరికీడ్చుకువెళ్ళాడు. ఆ ధీమా చూసి, భిల్లుదొర నా చెండికి తగిన వాడివే దొరికావు, కాని దీన్ని పెళ్ళాడాలంటే నీవు మాలో కలిసిపోయి మాతోపాటు దొంగతనాలు కూడా చెయ్యాలన్నాడు. ఆ కట్టడికి ఒప్పుకుని శంకరుడు అక్కడే ఉండి చమత్కారంగా ఆటపాటలతోనే చండిని లొంగదీసుకుంటున్నాడు. ఆ సమయంలో భిల్లులతోపాటు శంకర్ దొంగతనానికి వెళ్ళవలసి వచ్చింది.

శంకర్ రాజమందిరంలోనే చొరబడ్డాడు. ఆశ్చర్యం! పూర్వం కలలో మాదిరే ఉమ నిద్రిస్తూ కనిపించింది. ఏమిటీ మాయ, మరి చండి ఎవరు? ఇద్దరూ ఒకే పోలిక, బుగ్గన చుక్క కూడా ఒకే పోలిక. దైవయోగం తన ప్రియురాళ్ళిద్దరయారు. శంకరిలా ఆలోచిస్తూ ఉండగా ఉమ మేల్కొంచి శంకర్ని చూసింది. ఉభయులూ, జంటకవుల్లాగా తమ తొలినాటి అనుభవాలు, అంతరాత్మలు సంతసించడం, బుజాలదరడం, కూడబలుక్కొని మళ్ళీ ఒకరినొకరు గాఢంగా ప్రేమించి తన్మయత్వంలో ఉండగా "దొంగ" అని అరుస్తూ రాజభటులు వచ్చారు. ఏమిటి 'మీరు దొంగలా' అని రాకుమారి శంకించగా "అదేంకాదు మళ్ళీవచ్చి చెపుతా"నని శంకర్ సౌధం దూకేసి తప్పించుకుపోయాడు. రాజుగారురాగానే ఆ వచ్చింది దొంగకాదు తన స్వప్న సుందరుడని ఉమ చెప్పింది. ఆ మాటతో ఉగ్రుడై రాజగారు "నీవు దొంగను ప్రేమించరాదు. వాణ్ణిపట్టి ఉరిదీయిస్తా చూడు" అని శాసించి ఆ దొంగను పట్టితెండని భటులను పంపాడు.

రాజభటులను తప్పించుకునే యత్నంలో శంకర్ ఒక శిధిల శివాలయంలో దూరాడు. ఇక్కడ మరీ అద్భుతమైన దృశ్యం కంటపడ్డది. గౌరి శివుని ప్రార్థిస్తోంది. సరిగా ఉమా చండీల పోలికే. వారివలెనే ఈమె తన మనస్సు పరవశింపజేస్తోంది. "నీవే నా పతివి, నీ కోసమే నా జన్మ: నీవు పరిగ్రహించకపోతే నేనీ మానవ సమాజంలో మనజాలను" అని శివునితో మొరపెట్టుకొంటోంది. శంకర్కి ఆవేశం వచ్చింది. శివ విగ్రహం వెనుకనుంచే "జంగమదేవర వేషంలో నేను నీ గృహానికి వచ్చి నిన్ను పరిగ్రహిస్తాను కల్యాణీ" అని గౌరికి అభయమిచ్చాడు. గౌరి స్వామి పలికేడని ఆనందించి, అచ్చటికి అప్పుడే వచ్చిన శేషాయ్తో స్వామి తన మొరాలించాడని

చెప్పింది. శేషాయ్ గౌరిని బుజ్జగించి ఇంటికి తీసుకువెళ్ళింది. వారి సంభాషణలో తన ప్రేయసి పేరు గౌరి అని నివాసం వేశ్యవాడలో అని గ్రహించి శంకర్ బైటికి వచ్చి, మళ్ళీ రాజభటులు తరుమగా, చమత్కారంగా తప్పించుకొన్నాడు. కానీ, రాజభటులు విసిరిన బాకు భుజంలో గుచ్చుకొని బాధతో ఆయాసంతో భిల్లుగూడెం దగ్గరికి వచ్చి పడిపోయాడు. ఈ వార్త తెలిసిన చెండి పరుగున వచ్చి శంకర్‌ని ఆప్యాయంగా ఒడిలోకి తీసుకొని చేతితో నిమురుతోంది. ఆ హస్తస్పర్శ మహిమ శంకర్ గాయం పోయి ఆనందంగా చండి కళ్ళల్లోకి చూశాడు. సిగ్గుతో చండి పరుగెత్తింది. శంకర్ ఆమెను ప్రేమగీతంతో ఆక్రమించాడు. వారి సరాగం చూచి భిల్లుదొర వారికి పెళ్ళి చేయ నిశ్చయించాడు.

విటులవద్ద డబ్బు గుంజి, కాస్త కనిపించైనా వాళ్ళని సంతోషపెట్టమని, శేషాయ్ గౌరిని బలవంతం చేస్తుండగా, బైటనుంచి జంగమ వేషధారియై వచ్చిన శంకర్ మాట వినిపించింది. వెంటనే గౌరి స్వామి వేంచేశారని ఆనందంతో వెళ్ళి శంకర్‌ని గౌరవంగా లోపలికి తీసుకువచ్చింది. అడ్డం వెళ్ళిన శేషాయ్‌కి శంకర్ మొహరీల వర్షం కురిపించాడు. ఇక ఏ ఆటంకమూ లేకుండా గౌరి శంకర్ని పూజా మందిరంలోకి తీసుకపోయి ఆనందపరవశయై పతి పాదపూజ చేసింది.... ఆ ప్రియురాలికి తరువాత వచ్చి వెంట తీసుకపోతానని అభయమిచ్చి రాకుమారి కోసం శంకర్ బయలుదేరాడు. తను కనుపిస్తే రాజుగారికి కోపం వస్తుందని తెలిసి సాధు వేషంలో వెళ్ళి, దొంగపై తగిలిన రాకుమారి మనస్సు మంత్రజప మహిమతో మార్చివేస్తానని రాజుగారిని నమ్మించి, రాకుమారిని ఏకాంతంగా కలుసుకునే అవకాశం చిక్కించుకుని, తరువాత, తానూ ఉమా కలిసి అక్కణ్ణించి రహస్యంగా తప్పించుకుపోయారు.

శంకరూ ఉమా ఒకచోట ఏకాంతంలో ప్రణయగాన పారవశ్యంలో ఉండగా, హాహా హూహూలతో హెచ్చరింపబడ్డ లంబకర్ణుడు వచ్చి, శంకరుని మోసగించి, ఉమను చిలకనుగాచేసి తీసుకుపోయాడు.

లంబకర్ణుడు ఉమను తన మాయా మందిరంలో ఉంచి బలాత్కరింపబోయాడు. సరిగా ఆ సమయానికి వాడికి నిద్ర ముంచుకువచ్చింది. ఉమను జాగ్రత్తగా బంధించి ఉంచమని హాహా హూహూలకు చెప్పి లంబకర్ణుడు నిద్రపోయాడు. శేషాయ్ ఇంటికి మదనసింగు వచ్చి గౌరి కోసం లంచం ఇచ్చాడు. గౌరిని నీవే వశం చేసుకోమని చెప్పి శేషాయ్ మదనసింగును గౌరి

మందిరంలోకి పంపింది. మదనసింగు గౌరిని బలాత్కరింపబోయి చేయి తాకగానే అదేంమాయో ఆడదైపోయాడు. అది తెలిసి మదనసింగు భార్య "ఇదేదో మంత్రకత్తె ఈ మాయ చేసింది రాజుగారితో చెప్పి దండింపిస్తాను రం"డని గౌరినీ, శేషాయ్‌నీ అందర్నీ రాజసభకు తీసుకపోయింది.


రాజుగారు గౌరిని చూడగానే తన ఉమే అనుకున్నాడు. కాని, అంతలో భటులు చెండిని పట్టుకువచ్చారు. చెండీ, గౌరి ఒకే పోలికగా ఉండడం చూసి, సరి, తన ఉమా – ఈ చెండీ గౌరీలు ఒక తల్లి బిడ్డలై ఉండాలని నిర్ణయించి, తన ఉమ వచ్చేవరకూ వారి నందర్నీ అక్కడే ఉండమని శాసించి, మదనసింగును గౌరి కాళ్ళు పట్టుకుని ప్రార్థించమని బుద్ధి చెప్పాడు. మదనసింగు చేసిన నేరానికి చెంపలు వేసుకుంటూ గౌరి కాళ్ళు పట్టగానే మళ్ళీ వానికి మగ రూపం వచ్చింది. ఆశ్చర్యం.

ఉమ కోసం వెతుకుతూ వస్తున్న శంకర్‌కి దారిలో ఒక మహర్షి శవం కనిపించింది. ఆ శవానికి శంకర్ దహనసంస్కారం చేశాడు. అప్పుడా చితి జ్వాలలలో ఒక గంధర్వుడు ప్రత్యక్షమై, శంకర్ తన శవానికి సంస్కారం జరుపుటవల్ల తనకు శాపవిమోచన మైనదనీ, ప్రత్యుపకారంగా శంకర్‌కి, ఉమను లంబకర్ణుడు బంధించిన రహస్యంచెప్పి, "ఆ రాక్షసుని రూపమూ శక్తులూ కలిగినవాడు గాని వాని మాయామందిరం చేరలేరనీ, అందుకు పరరూపధారణ విద్య అను మంత్రము తన కృష్ణాజినములో కలదు గ్రహింపమనీ చెప్పి నీ వెవరి రూపం తీసుకుంటే వారి కా సమయంలో నీ రూపం వస్తుంది జాగ్రత్త" అని హెచ్చరించి అదృశ్యుడయ్యాడు.

ఆ మంత్ర మహిమతో శంకర్ లంబకర్ణుడై మాయామందిరం చేరి ఉమను తీసికొని తల్లిని చూడ్డానికి తన ఆశ్రమానికి వెళ్ళాడు.

శంకర్ రూపంలో నిద్రిస్తున్నది లంబకర్ణుడని తెలియక హాహా హూహూలు వానిని తీసుకపోయి రాజుగారి మందిరంలో పడవేశారు.

శంకర్ అనుకొని రాజుగారు వానిని బంధించడం, హఠాత్తుగా ఆ శంకర్ లంబకర్ణ రాక్షసుడై రాజునీ అందర్నీ ఉరి స్తంభాలకు కట్టి మునులను హింసించడం, హాహా హూహూల సహాయంతో శంకర్ వచ్చి లంబకర్ణుని వధించి శుభంగా దివ్యకధను జరిపించడం ఆ చిత్రమంతా చిత్రంలోనే చూడాలి.



జమదగ్ని :— ఘంటసాల—

శ్రీ కరంబై అపూర్వమై చెలగునెద్ది ?
ఏది చిత్ర విచిత్రమై హృద్యమగును ?
ఏది పుణ్య ప్రదంబైన ఎరుక నొసగు ?
ఏది వినిన పాపములె హరించి పోవు ?
అట్టి సత్కథ ఏది, మహర్షులార ?

పులోమ : లీల—

శ్రీ గౌరి నాపాపలై నన్ను దీవింప దయచేసెనే ॥శ్రీగౌరి॥

లోక మాతలకు తల్లివౌ తల్లీ నీకె తల్లినౌ వరమిచ్చినావా
మూడు లోకాల తరియింపగౌరి మూడు రూపాల విలసిల్లినావా ॥శ్రీగౌరి॥

నీవు శక్తి స్వరూపమె చిన్నీ నీవు రక్తికి నిలయమ్మ కన్నీ
పతిభక్తి కాదర్శము చిట్టీ మీ లీల భువికెల్ల మేలౌనులే ॥శ్రీగౌరి॥

ఉమ, చెలులు—

సుశీల, బృందం—

ఆహా సఖి ఈ వనమే కనగా మనసాయె
మనసాయె మనసాయె మనసాయె

ప్రియగాన మహాసాగిన వినగా మనసాయె
మనసాయె మనసాయె మనసాయె ॥ఆహా॥

పరాగ విభవముతో మల్లెపూల ఘుమ ఘుమలు
సరాగ గీతముతో తుమ్మెదల రిమ ఝుమలు
వసంతుడే మదిలో పిలిచినటుల అనిపించె
దిసంతులేమేమో పలికినటుల వినిపించె ॥ఆహా॥

విలాస లీలలతో లతలు తరులు కలియగనే
వికాస హాసముతో వనసుందరి విరియగనే
అనంగుడే వలపు తలపు చిగురించె
చలించు హృదయములో శృతిని సరిగ సవరించె ॥ఆహా॥

ఘంటసాల, సుశీల—

శంకర్ : ఏమిటో ఈ మాయా కలలోని కథవలెనాయే ॥ ఏమిటో ॥

ఉమ : వాని నరసీ వాని నొరసీ మనసు విరిసేనే
తానుగా నను తాకెనే అది నిజమే కారాదా ॥ ఏమిటో ॥

శంకర్ : నాటిదో ఏనాటిదో నేటి యీ చెలిమి
మేలుగా ఒక లీలగా కల నిజమే కారాదా ॥ ఏమిటో ॥

ఉమ : కనులు కలిసి మనసు తెలిసి మేనులే సొలసి
ఉంటిమని కలగంటికదా అది నిజమే కారాదా ॥ ఏమిటో ॥

శంకర్ : ఎన్ని జన్మల పరిచయముతో నన్ను పిలిచేనో, సఖీ
మేలుగా ఒక లీలగా కల నిజమే కారాదా ॥ ఏమిటో ॥

ఉమ : వరుని కొరకై జీవితమంతా విరహ బాధయేనా
మాయయే మటుమాయమై కల నిజమే కారాదా ॥ ఏమిటో ॥

చండి, చెలులు— యల్. ఆర్. ఈశ్వరి, బృందం—

నన్నూ వరించు వీరుడు నన్నూ జయించు ధీరుడు
నన్నూ భరించు మొనగాడూ ఎవడే ఎవడే వాడెవడే ॥ నన్నూ ॥

నాతో పందెము లాడగనే నాజిగి నాబిగి చూడగనే
డింకకొట్టక డొంకపట్టక జంకక నిలిచే వాడెవడే ॥ నన్నూ ॥

నా పరవడికి ఆగేనా నా ఉరవడికి తూగేనా
నను కనిపెట్టీ నా చెయిపట్టీ వనరుగ వలచే వాడెవడే ॥ నన్నూ ॥

వడిగల వాడూ వచ్చేనా వగలూ వలపూ తెచ్చేనా
భువిలో లేడని దివినుండె నా దిగి రాగలిగిన వాడెవడే ॥ నన్నూ ॥

శంకర్ : ఘంటసాల—

అబ్బలాలో ఓ యబ్బలాలో నీ అడుగు అడుగునా తళుక్
నీ కులుకు కులుకునా బెళుక్ నీ విసురు విసురునా ఛెళుక్
తళుకు కన్న బెళుకు మిన్న బెళుకు కన్న ఛెళుకు మిన్న
ఇన్నివన్నె చిన్నెలున్న నిన్ను విడిచి పోనులే ॥ అబ్బ ॥

తటాలుమని నీ మిటారి చూపులు కటారులై ఎదనాటెలే, బల్
హుటాహుటిగ మది దూటెలే
ఎంత టక్కు చేసినావు ఎంత టెక్కు చూపినావు
ఇన్ని టక్కు టెక్కులున్న నీకు జోడు నేనెలే ॥ అబ్బ ॥

చందమామనే డిందుచేసెనే కందిపోయినా నీ మోము
మెరుపుతీగెనే మరువజేసెనే మెలిక తిరిగినా నీ మేను
మోములోని ఇంపు జూచి మేనులోని సొంపు చూచి
ఇన్ని ఇంపు సొంపులున్న నిన్ను పొగడలేనులే ॥ అబ్బ ॥

గౌరి : జానకి—

నన్నేల మరచినావో ఓ దేవ దేవా ॥ నన్నేల ॥

మన ప్రాణ మొకటి కాగా నిను కొలిచి యుంటినే
మన మేను లొకటికాగా నిను వలచి యుంటినే ॥ నన్నేల ॥

ఈ పాపి జగతిలోన నా జనన మేలనో
ఈ మూఢ జనుల హింస నే నోర్వజాలనే ॥ నన్నేల ॥

మొర నాలకింపవేలా మనజాలనో ప్రభూ
నన్నేలుకొనగ రావా నే కొలుచు దేవదేవా ॥ నన్నేల ॥

ఘంటసాల, ఎల్. ఆర్. ఈశ్వరి—

శంకర్ : ఓ సిగ్గులొలికే సింగారి పిల్లా ఎగ్గులేదే కంగారు పిల్లా
నిలిచి పాడవే - నాతో కలసి ఆడవే -

చండి : ఓ మొగ్గలేసే ఓ చిన్నవాడా తగ్గిరావోయ్ ఓ వన్నెకాడా
పాటలేమనీ నీతో ఆటలేమని—

శంకర్ : ఓర చూపుతో నన్ను కోరినది ఏమని ?

చండి : నీ టక్కు-టెక్కులు చాలని నా దిక్కు- చూడగ రాదని

శంకర్ : దాచుకున్న నవ్వులోన తోచు భావ మేమని

చండి : ఈ పిచ్చి వాగుడు వద్దని నీ వచ్చిందారిని పొమ్మని

శంకర్ : నీదు గుండెలో ఏదో సందడించె ఏమని ?

చండి : నావంక చూచుటె తప్పని అది మానకుంటె ముప్పని

శంకర్ : కన్నెపిల్ల కోపమందు ఉన్న గుట్టు ఏమని ?

చండి : ఈ శంక లిక్కడ కాదని ఇక డింక కొట్టక పొమ్మని

శంకర్ : నీ కోరచూపులు ఏమని ? నీ కొంటెనవ్వులు ఏమని ?
నీ అల్లిబిల్లి ఏమని ? ఏమని ? ఏమని ? ఏమని ?

చండి : ఇలా నీవు చెంతనుంటే ఖులాసా కదా యని
సదా నన్ను వీడకుంటే అదే మేలు మేలని

గౌరి :

జానకి—

సుందరేశ్వరా ఇందుశేఖరా కను విందుగ నా సేవల గొని కనికరించరా
పరమ పావనము మధుర మోహనము నిత్య శోభనము నీ మంగళ రూపము
కనులార తిలకించి మనసార అలరించి నేడు నే ధన్య నైతిరా దేవా ! ॥ సుంద ॥

సకల జీవులకు సర్వ దేవులకు పరమ తారకమగు నీ పాదయుగళి
తనివితీర పూజించి తనువు మరచి ధ్యానించి బాధలే మరచినానురా దేవా ! ॥ సుంద ॥

శంకర్ :

ఘంటసాల—

కలగంటివా చెలీ కలగంటివా కలలోన నీప్రియుని కనుగొంటివా
నిండు చందురుని పోలినవాడా పండు వెన్నెలలో నినుచేరినాడా
మేనుసోకించి మేల్కొల్పినాడా మౌన భావాన మనసిచ్చినాడా ॥ కల ॥

కన్నులు కన్నులు కలుసుకొన్నాయా పెళ్ళిబాజాలు మంత్రాలు వినిపించినాయా
ఉమను శంకరుని తలచుకొన్నారా పేరుపేరున పిలుచుకొన్నారా ॥ కల ॥

ఘంటసాల, సుశీల—

ఉమ : నీ లీలలోనే ఒక హాయిలే నీ ప్రేమ లాలనలోనే ఒక మాయలే

శంకర్ : నీ లీలలోనే ఒక హాయిలే నీ ప్రేమ లాలనలోనే ఒక మాయలే

శంకర్ : నీ వున్నచోటే స్వర్గాలుగా భువనాలనేలా నా కేలలే

ఉమ : దివినైన ఏలే పతి ఉండగా ఏవైభవాలో నాకునూ ఏలలే

శంకర్ : నా విందు నీవై చెలువొందగా ఏ చందమామో నా కేలలే

ఉమ : నా వెలుగు నీవై విలసిల్లగా ఏ వెన్నెలైనా నాకునూ ఏలలే

శంకర్ : నీ వలపు వాహినిలో నే తేలగా ఏ కేళియైనా నా కేలలే

ఉమ : నీ ప్రేమ లాహిరిలో నే సోలగా ఏ లాలనైనా నాకునూ ఏలలే

భృగుమహర్షి, ఋషుల బృందము—

జయజయ శంకర ఉమామహేశ్వర !
చండీనాథా ! గౌరీ మనోహర !
జయజయ శంకర మాం పాహీ !
ముల్లోకాలకు తల్లిదండ్రులై
చల్లగ భక్తుల నేలు దంపతులు
జయ పరమేశ్వరి ! జయ పరమేశ్వర !
జయజయ శంకర మాం పాహీ